తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
పేజీలు : 08
బుధవారం
27 మార్చి 2024

## కాప్రా కస్టోడియన్ ల్యాండ్‌ను కబ్జాదారుల నుండి కాపాడండి

### ప్రాణ రక్షణ కల్పించండి : జిల్లా అధికారులకు మండల దేవేందర్ వినతి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 26 (జనంసాక్షి)**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, కాప్రా మండల రెవిన్యూ పరిధిలోని కస్టోడియన్ భూముల విషయమై మమ్మల్ని తప్పుదారి పట్టించి, మా పేరిట కోర్టుల్లో కూడా తప్పుడు పత్రాలతో ఆర్డర్ పొంది అటు రెవిన్యూ అధికార సిబ్బందిని, కాలనీవాసులు అనేక మందిని బ్లాక్ మెయిల్ చేస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్న సదరు వ్యక్తుల నుండి తనకు, తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని మండల దేవేందర్ ఆందోళన వ్యక్తం చేశాడు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కాప్రా మండల పరిధిలోని సర్వే నంబర్లు 9, 11, 47, 140, 143, 151, 153, 676, 677 లలో మొత్తం 90 ఎకరాల 08 కస్టోడియన్ భూములు రెవెన్యూ రికార్డు ప్రకారం ఉంది. కొందరు వ్యక్తులు మండల కుటుంబీకులు ఈ భూములపై వేరువేరుగా పలు కోర్టుల్లో దావాలు వేయగా 2011 లో వాటన్నిటిపై విచారించిన సుప్రీంకోర్టు కొట్టివేసింది. కాందిశీకుల వారసులు ప్రైవేటు వ్యక్తులకు కొంత భూమిని విక్రయించగా, నివాస గృహాలు వెలిశాయి. మిగతా 69 ఎకరాల21 గుంటల ఏవాక్యు ఇప్పటికీ ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నాయి.కస్టోడియన్ భూములపై కాప్రా కు చెందిన మండల కుటుంబానికి సంబంధించిన కొందరు వ్యక్తులు వేసిన పలు కేసులను సుప్రీంకోర్టు 2011 సంవత్సరంలో కొట్టివేశారు. సుప్రీంకోర్టు కొట్టి వేసిన కేసుల విషయాన్ని మాకు తెలియపరచకుండ, శరత్ చంద్రారెడ్డి అనే వ్యక్తి మా నుంచి జిపిఏ తీసుకున్నారు. మండల కుటుంబానికి సంబంధించిన వారు తమలో తాము గొడవ పడినట్లుగా కోర్టును ఆశ్రయింపజేసి సదరు భూముల పంపకాలను సామరస్య పూర్వకంగా జరుపుకోవాలని లోక్ అదాలత్ ద్వారా ఒక అవార్డు ను తీసుకున్నాము. ఈ వివాదంలో రెవెన్యూ అధికారులను,కాంధీశీకుల వారసుల నుంచి భూమిని కొని చేసిన వారిని పార్టీలుగా పేర్కొనలేదు.కోర్టు ద్వారా పొందిన అవార్డును అడ్డం పెట్టుకొని శరత్ చంద్ర రెడ్డి పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలంటూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ ఆర్డర్లో ఎవరికి ప్రొటెక్షన్ ఇవ్వాలో ఎవరి నుంచి ప్రొటెక్షన్ కావాలో ఏమీ లేకుండానే ఈ ఆర్డర్ ను తీసుకువచ్చాడు. ఈ ఆర్డర్ ను అడ్డుపెట్టుకొని శరత్ చంద్రారెడ్డి, నాగరాజు లతోపాటు వారి అనుచరులు పోలీసులు, రెవెన్యూ అధికారుల తోపాటు, ఇల్లు నిర్మించుకున్న యజమానులను బ్లాక్ మెయిల్ చేస్తూ, భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. కాప్రా మండల రెవెన్యూ అధికారులను సంప్రదించగా మా పూర్వీకులు ఇట్టి భూములపై వేసిన వివిధ కోర్టుల్లో ఉన్న కేసులు అన్నిటిని ఒకచోట విచారించి, సుప్రీంకోర్టు కేసు నెంబర్లు 4099,4100,4101,3949 కొట్టివేస్తూ 2011 లో మా మండల కుటుంబీకులకు, ఈ భూమిపై ఎలాంటి హక్కు లేదని తీర్పునిచ్చింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మాకు ఎలాంటి హక్కు లేనప్పటికీ శరత్ చంద్ర రెడ్డి మా మండల కుటుంబీకులతో జిపిఏ చేయించుకున్నారు. అందులో నేను ఒకడిని. జిపిఏ చేసిన వారిలో మండల ధనుంజయ గౌడ్, మండల శ్రీనివాస్ గౌడ్ మరణించారు. శరత్ చంద్ర రెడ్డి,నాగరాజులు ఈ పోలీస్ ప్రొటెక్షన్ ఆర్డర్ ను అడ్డం పెట్టుకొని, కస్టోడియన్ భూములను కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. మా మండల ఫ్యామిలీకి కస్టుడియన్ భూములపై ఎలాంటి హక్కు లేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో శరత్ చంద్ర రెడ్డి, నాగరాజు చేస్తున్న కబ్జాను అడ్డుకుంటున్నాను దేవేందర్ గౌడ్ తెలిపారు. నాకు, నా కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉంది. గతంలో కూడా నాపై దాడి చేసిన సమయంలో నేను పోలీసులకు ఫిర్యాదు చేశాను తెలిపారు. కాప్రా కస్టోడియన్ ల్యాండ్ ను కబ్జాదారుల నుండి కాపాడాలని కోరారు.






## ఏరియా హాస్పిటల్‌లో నిర్వాకం.. గర్భిణుల పట్ల నిర్లక్ష్యం

**ఎల్బీనగర్, మార్చి 26 (జనం సాక్షి)**

గర్భిణీల పట్ల డాక్టర్లు గాని సిబ్బంది గాని నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కార్పొరేటర్ మొద్దు ల చ్చిరెడ్డి హెచ్చరించారు. బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్లో వైద్యం సరిగ్గా అందించడం లేదని పేషంట్ల పట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని హాస్పిటల్ కి వచ్చే పేషెంట్లు స్థానిక బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి కి ఫిర్యాదు చేశారు. దీంతో కార్పొరేటర్ హాస్పిటల్ సందర్శించడం జరిగింది. సోమవారం నాడు మధ్యాహ్నం సమయంలో 9 నెలల నిండు గర్భిణి డెలివరీ కోసం ఏరియా హాస్పిటల్ కి రాగా కొంచెం ఆయాసంగా ఉందని చెప్పింది. డ్యూటీలో ఉన్న డాక్టర్ పేషెంట్ ని చూడకుండా ఎందుకులే హై రిస్క్ కేస్ అని చెప్పి కోటి హాస్పిటల్ కి రిఫర్ చేయడం జరిగింది. పేదవారైనా పేషంట్ కోటి హాస్పిటల్ కి వెళ్ళగా మళ్లీ ఏరియా హాస్పిటల్ లో వైద్యం అందిస్తారని తిరిగి పంపించడం జరిగింది. దాదాపు ఐదు గంటలసేపు ఇబ్బంది పడ్డ గర్భిని దిక్కుతోచక ప్రైవేట్ హాస్పిటల్లో చేరి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రైవేట్ హాస్పిటల్ లో మగ శిశువు కు జన్మనివ్వడం జరిగింది. ఇలా ఈ పేషెంట్ అనే కాదు చాలామంది ఫిర్యాదు చేయడం దీనిపైన సూపరెంట్ ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని కార్పొరేటర్ కి దృష్టికి తీసుకురావడంతో హాస్పటల్లో కార్పొరేటర్ సందర్శించి పేషెంట్లు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన హాస్పిటల్స్ సిబ్బందిని, డాక్టర్ పైన వెంటనే చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ కు కోరారు . ఇప్పటికైనా హాస్పిటల్ కి వచ్చే పేషెంట్లకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరించొద్దని హెచ్చరించారు , ఆర్థిక స్తోమత లేకే పేదవారు ప్రైవేట్ హాస్పిటల్ లో డబ్బులు చెల్లించలేక ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారని డాక్టర్లు వీలైనంతవరకూ మెరుగైన చికిత్స అందించాలని బయట హాస్పిటల్స్ కు రిఫర్ చేయొద్దని పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ హరిప్రియ, డాక్టర్ కృష్ణ, పార్టీ డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, అధికార ప్రతినిధి శరత్ కుమార్, నాయకులు జైపాల్ రెడ్డి, నరసింహారెడ్డి, సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





## చేవెళ్ల అభివృద్ధికి నిధులివ్వండి

### సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి

**చేవెళ్ళ, మార్చి 26 (జనంసాక్షి) :** మంగళవారం నాడు సీఎం క్యాంపు కార్యాలయంలో చేవెళ్ల పార్లమెంట్ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చేవెళ్ల మాజీ సర్పంచ్ దంపతులు బండారి శైలజాఆగిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి,జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ఏలుగంటి మధుసూదనరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జె శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, అత్తెల్లి రవీందర్ రెడ్డి, మాల్గారి మల్లా రెడ్డి ఉన్నారు.



## సాంబశివుడు ఆశయాలను కొనసాగిద్దాం

### కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర కార్యదర్శి యాకయ్య కురుమ

**జవహర్‌నగర్, మార్చి 27 (జనంసాక్షి) :** పేద ప్రజల అభ్యున్నతికోసం ఎనలేని కృషి చేసిన సాంబశివుడు ఆశయాలను కొనసాగిద్దామని కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర కార్యదర్శి మంగ యాకయ్య కురుమ అన్నారు. కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర కార్యదర్శి మంగ యాకయ్య ఆధ్వర్యంలో జవహర్ నగర్ కార్పొరేషన్ లోని ప్రగతినగర్ లో సాంబశివుడి 13వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగ యాకయ్య మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన సాంబశివుడి అడుగు జాడల్లో యువత పయనించాలని అన్నారు. సాంబశివుడి విగ్రహాన్ని ప్రభుత్వం ట్యాంక్ బండ్ పెట్టాలని, పాఠ్యపుస్తకాల్లో ఆయన చరిత్రను పొందుపరచాలని కోరారు. అనంతరం సాంబశివుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కుమార్ యాదవ్, నరేందర్, తిరుపతి,మహిళలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించాలి

### మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్





**రాజేంద్రనగర్, మార్చి 26(జనం సాక్షి) :** చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల సన్నాహాక ప్రక్రియలో భాగంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అధ్యక్షతన రాజేద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ,చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య , ఎమ్మెల్సీలు సురభి వాణీ దేవి , యెగ్గే మల్లేశం ,దయనంద్ గుప్తా , చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. నేడు రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోతే ప్రస్తుత ఎంపీ కష్టకాలంలో పార్టీని వదిలి వెళ్లారని,నాడు ఈ ప్రాంత ప్రజలకు తెలియని రంజిత్ రెడ్డిని కేసీఆర్ చెప్పారని ఎంపీగా బీఆర్ఎస్ కారు గుర్తుతో గెలిచిన వారు ఇపుడు మనకు ప్రత్యర్థులుగా పోటీ చేస్తున్నారని వారికి ఈ ప్రాంత ప్రజలు ఓటుతో గుణపాఠం సమాధానం చెప్పటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్సీ సురభి వాణిదేవి మాట్లాడుతూ గత 10 ఏళ్లలో కెసిఆర్ ప్రవేశపెట్టిన దళిత బంధు రైతుబంధు, కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ కెసఆర్ కిట్టు తదితర పథకాలు నేడు అమలు చేయక వంద రోజుల్లో కాంగ్రెస్ పాలనలో ప్రజలు క్షోభ పడుతున్నారని రైతు చనిపోతే రైతు బీమా రూ.5 లక్షలు రైతులకు అందకుండా పథకాలు నిర్వీర్యం చేశారని, ఎలక్షన్ కోడ్ తో అరకొరకు అమలైన పథకాలు పూర్తిగా నిలిచిపోయాయని , రైతాంగానికి సాగు త్రాగునీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని మళ్లీ ఈ ప్రాంతం అభివృద్ధి జరగాలంటే జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు.

**ఎంపీ రంజిత్‌రెడ్డికి ప్రజలే బుద్ధి చెప్తారు : సబితా**

కెసిఆర్ ని శూన్యం చేస్తానని ఎంపీ రంజిత్ రెడ్డి అంటున్నడని తెలంగాణను తెచ్చిన కెసిఆర్‌ని శూన్యం చేస్తే తెలంగాణ ప్రజలకు చేసినట్లు అని ఆమె అన్నారు.ఎంపీ రంజిత్ రెడ్డి ఈ ప్రాంతం అతను కాదని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలే తగిన సమాధానం చెప్తారని ఆమె ఘాటుగా అన్నారు. గతంలో ఇద్దరు ఎంపీలను చేవెళ్ల నుంచి టికెట్ ఇస్తే కొండా విశ్వేశ్వర్ రెడ్డి రంజిత్ రెడ్డి, గెలిచారని, ఇప్పుడు 10 సంవత్సరాల 5 సంవత్సరాలు జిల్లా పరిషత్ చైర్మన్ ,5 సంవత్సరాలు ఎమ్మెల్సీగా ప్రజలకు సేవలు అందించిన 96 కులాల అధినేతగా చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా జ్ఞానేశ్వర్ ముదిరాజును 65 వేల మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. చేవెళ్ల పార్లమెంట్ వి ఆర్ ఎస అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ కెసిఆర్ చేసిన అభివృద్ధి మూడు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన తీరుతో తెలిసిపోయిందని, తెలంగాణ అంటే చిన్న కెసిఆర్ అంతే వేగంతో అభివృద్ధి పరచాలని 96 కులాలకు ప్రాతినిథ్యం వహించిన నేను ఇక్కడ అన్ని వర్గాలకు సమానంగా గొంతుకై పోరాటం చేశానని, ఇప్పుడు ఇక్కడ పూర్తిస్థాయిలో అభివృద్ధి జరగాలంటే కెసిఆర్ ఇచ్చిన అవకాశాన్ని మీరందరూ ఉపయోగించుకోనే విధంగా కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గండిపేట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆర్. నరసింహ, నార్సింగ్ చైర్ పర్సన్ రేఖ యాదగిరి, వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్, శంషాబాద్ చైర్ పర్సన్ సుష్మా మహేందర్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ కే రామకృష్ణారెడ్డి, పి. రూపా రెడ్డి, అధ్యక్షుడు చంద్రారెడ్డి ,డి.వెంకటేష్ గౌడ్, అధ్యక్షులు ప్రేమ్ గౌడ్ పి ధర్మారెడ్డి వనం శ్రీరామ్ రెడ్డి కార్పొరేటర్ అర్చన జయప్రకాష్, చంద్రారెడ్డి, కౌన్సిలర్ పత్తి ప్రవీణ్, సింగల్ విండో వైస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, గణేష్ గుప్తా, మహమ్మద్ బషీర్ పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**సమావేశంలో బీజేఎంసీ నాయకులు లోటు..**

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కాంగ్రెస్ పార్టీలో చేరగా, ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం డిప్యూటీ మేయర్ ఆధ్వర్యంలో గట్టెక్కడంతో బీఆర్ఎస్ సమావేశంలో బండ్లగూడ జాగిర్ నాయకుల లోటు కొట్టొచ్చినట్టు కనిపించింది.



## రాబోయే ఎన్నికల్లో బీజేపీకే పట్టం కట్టాలి

### బిజెపి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు విక్రమ్ రెడ్డి

**శామీర్ పేట్ (జనం సాక్షి ):** మల్కాజ్గిరి ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ ను అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు విక్రం రెడ్డి అన్నారు.మంగళవారం తుర్కపల్లిగ్రామం నుండి యువకులు ఈటెల సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుద్ధి శ్రీనివాస్,అమర మోహన్ రెడ్డి,వంగరి హృదయ కుమార్ మండల అధ్యక్షులు కైరా యాదగిరి, కీసర సత్యనారాయణ మెడబోయిన నర్సింగరావు నీరుడి అశోక్ రుద్రబోయిన దుర్గ ప్రసాద్ శేఖర్ రాము శ్రీను బీజేవైఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 102 అమ్మ ఒడి సంస్థలో డ్రైవర్లు కావాలి

**శామీర్ పేట (జనం సాక్షి ) :** 102 అమ్మ ఒడి సంస్థ, ఫ్రీ హౌస్ సర్వీస్ లో డ్రైవర్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ షేక్ జాన్ షాహిద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అమ్మ ఒడి సంస్థ, ఫ్రీ హౌస్ సర్వీస్ తో పాటు అంతిమ పరమపద పార్థివ వాహనంలో డ్రైవర్ ఉద్యోగాలు ఉన్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ఈ ఫోన్ నెంబర్లలో 9502765108, 88011 11700 సంప్రదించాలని తెలిపారు.



## అక్రమంగా కలప తరలిస్తున్న లారీ పట్టివేత

**కొడంగల్ మార్చి26(జనం సాక్షి)** అక్రమంగా లారీలో తరలిస్తున్న కలపను పట్టుకున్నట్లు కొడంగల్ ఎస్సై భరత్ రెడ్డి తెలిపారు.కర్ణాటక నుండి కొడంగల్ మీదుగా హైదరాబాద్ కు తరలిస్తున్న కలప లారీని ఎస్ఐ లారీని ఆపి తనిఖీ చేయగా అనుమతి పత్రాలు డ్రైవర్ ను అడుగాగ ఎలాంటి అనుమతి పత్రాలు చూపించకపోవడంతో లారీ డ్రైవర్ పై కేసు నమోదు చేసి ఫారెస్ట్ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

## రాజేంద్రనగర్ భాజపా కోర్ కమిటీ సమావేశం



**రాజేంద్రనగర్, మార్చి 26 (జనం సాక్షి) :** రాజేంద్రనగర్ భాజపా డివిజన్ కోర్ కమిటీ సమావేశం డివిజన్ అధ్యక్షుడు బాబురావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రాజేంద్రనగర్ డివిజన్ ఇంచార్జ్ డాక్టర్ ప్రేమ్ రాజ్ యాదవ్ , రాష్ట్ర బిజెపి నాయకుడు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ డివిజన్ కమిటీ సమావేశాలు అలాగే వివిధ మోర్చాల కమిటీలు సమావేశాలు జరపాలని తీర్మానించారు.బూత్ కమిటీలు పరిశీలన చేసి లిస్టు తీసుకోవాలని, బూతు వారిగా లాభార్తి సంపర్క్ అభియాన్ జరపాలని, ప్రతి బూతులో కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ లిస్టు వెరిఫికేషన్,బిఎల్ఎ 1,2 లిస్ట్ చేయాలని సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వై. శ్రీధర్, బొక్క బాల్ రెడ్డి కోరని సదానంద్, సోల్కర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, హరి కిషన్, రాజేంద్రనగర్ డివిజన్ భాజపా ప్రధాన కార్యదర్శి పసుపుల సందీప్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## జల సంరక్షణ కోసం అందరూ కృషి చేయాలి

### డి బలరామరాజు జనరల్ మేనేజర్

**ఎల్బీనగర్ , మార్చి 26,(జనంసాక్షి) :** ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా జలమండలి సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జలసంరక్షణ కోసం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలలో భాగంగా నందనవనంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డివిజన్ జనరల్ మేనేజర్ డి బలరామరాజు విచ్చేసినారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ నీటి దినోత్సవం లో భాగంగా సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వారు కాలనీలో పాఠశాలల్లో జల సంరక్షణ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఇంకుడు గుంతలు వాటి నిర్వహణపై ప్రజలకు తెలియజేస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు అన్నారు ప్రస్తుతం మనకు నీటికి ఇబ్బందులు లేకపోయినప్పటికీ మున్ముందు నీటి కష్టాలు రాకుండా ముందు జాగ్రత్తగా మనందరం నీటిని వృధా చేయకుండా చూసుకోవాలన్నారు. సలహాలు సూచనలు అవసరమైతే జలమండలి అధికారులను లేదా సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వారిని సంప్రదించవచ్చునన్నారు బ్రోచర్ ప్రదర్శన అనంతరం చేయించారు ఇంకుడు గుంత గురించి వివరిస్తూ పాఠశాలలో గతంలో నిర్మించిన ఇంకుడు గుంతను శుభ్రం చేసి ఇసుకను పోయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిజిఎం శ్రీను రావుల మాట్లాడుతూ విద్యార్థులు జల సంరక్షణ కార్యక్రమంలో పాలుపంచుకోవాలన్నారు తమ కాలనీలలో ఇండ్లలో నీరు వృధా అవుతున్నట్లయితే దానిని అరికట్టేందుకు ప్రయత్నించాలన్నారు ఇంకుడు గుంతల ప్రాముఖ్యత గురించి తెలుసుకోవాలన్నారు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. సేవ్ ఎర్త్ ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ టి సురేందర్ జల ప్రతిజ్ఞ చేయించడం జరిగింది పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ రావు ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు రజిత మాట్లాడుతూ జలమండలి సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో తమ పాఠశాలలోని విద్యార్థులకు మంచి అంశంపై అవగాహన కల్పించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ కార్యక్రమ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలియజేశారు. మేనేజర్ ఎన్ రవీందర్ రెడ్డి, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఎన్ జయసూర్య, ఏటిఓ ఎన్ నర్సింగ్ రావు లైన్మెన్ ఎండీ అఖిల్ పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి


## జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి




**వికారాబాద్ రూరల్ మార్చ్ 26 (జనం సాక్షి) :**

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని, అందరికి అవగాహనా కలిగే విదంగా స్వీప్ కార్యక్రమం లో భాగంగా 5%ని% రన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం ఎన్ ఐ సి ,వి సి హాలు నందు ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమం లో బాగంగా జిల్లా లో ఎన్నె పల్లి చౌరస్తా నుండి అలంపల్లి చౌరస్తా వరకు రేపు ఉదయం 6 గంటలకు 5k రన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఏర్పాటు చేసిన 5కే రన్ లో పాల్గొనాలని, జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, మెడికల్, నర్సింగ్ కళాశాల ల విద్యార్థులు, యువత పెద్ద సంఖ్య లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేయాలనీ ఆదేశించారు. ఈ కార్యక్రమములో జిల్లా అధికారులు, ఉద్యోగులు , విద్యార్థిని , విద్యార్థులు, తదితరులు పాల్గొనేలా చూడాలనిసంబంధిత అధికారులకు ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, ఆర్ డి ఓ తాండూర్ శ్రీనివాస రావు, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ , మైనార్టీ అధికారి సుధారాణి, డి వై ఎస్ ఓ హనుమంత రావు, అడిషనల్ డి అర డి ఏ సరోజ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన జ్ఞానేశ్వర్ ముదిరాజ్



**రాజేంద్రనగర్, మార్చి 26 (జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశం జూబ్లీహిల్స్ ఎంపీ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గం నుండి ఏ బ్లాక్, బి బ్లాక్, డివిజన్ అధ్యక్షులుతో టిపిసిసి ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ కో ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పాల్గొన్నారు. పార్టీకోసం అహర్నిశలు పనిచేసిన నన్ను గుర్తించి తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ కో ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గా నియమించినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ని హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ జరగనున్న ఎంపీ ఎన్నికల్లో ప్రస్తుతం ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి గెలుపే లక్ష్యంగా అత్యధిక మెజారిటీతో గెలుపు లో తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# త్వరలో జరిగే సాధారణ లోక్‌సభ ఎన్నికల్లో పకడ్బందీ విధులు

## జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి

**వికారాబాద్ రూరల్ మార్చు 26( జనంసాక్షి) :** జిల్లా లో జరిగే సాధారణ లోకసభ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ విధులు నిర్వహించే పిఓ, ఎపిఓ, ఓపిఓ ల విదుల కేటాయింపునకు మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించినట్లు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం ఐ డి ఓ సి ఎన్ ఐ సి వీడియో కాన్ఫరెన్సు హాలు నందు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గాలకు సిబ్బంది కేటాయింపునకు ఆన్లైన్ ద్వారా మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో నాలుగు నియోజకవర్గాలు కోడంగల్ , పరిగి, తాండూర్, వికారాబాద్ నియోజకవర్గాలకు పి ఓ , ఏ పి.ఓ , ఓ పి .ఓ పోలింగ్ సిబ్బందిని మొదటి దశ ర్యాండ్ మైజషన్ ద్వారా విదులు కేటాయించినట్లు తెలిపారు. ప్రక్రియ పూర్తి చేసి స్క్రీన్ ద్వారా చూపించారు. మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ తదుపరి మాస్టర్ ట్రైనర్స్ పిఓ, ఏపిఓ లకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్ , ఎన్నికల సెక్షన్ సుఫరింతెన్డేంట్ శ్రినివాష్, ఈ.డి.ఎం మహమ్మద్ సంబంధిత అధికారులు , తదితరులు పాల్గొన్నారు



# 13 పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ

## జిల్లా కలెక్టర్ శశాంక పర్యవేక్షణలో నిర్వహణ

**ఇబ్రహీంపట్నం, మార్చ్ 26(జనంసాక్షి):** పార్లమెంటు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మంగళవారం పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్ఐసి హాల్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. రంగారెడ్డి జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో గల పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు (పీ.ఓ), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఏ.పీ.ఓ)లను, ఇతర పోలింగ్ అధికారులు (ఓ.పీ.ఓ)లను ర్యాండమైజెషన్ ద్వారా కేటాయించారు. రిజర్వ్ సిబ్బందిని కలుపుకుని జిల్లా పరిధిలోని ఎనిమిది సెగ్మెంట్లకు మొత్తం 16536 మంది పోలింగ్ సిబ్బందిని నియమిస్తూ ర్యాండమైజేషన్ జరిపారు. వీరిలో పీ.ఓలు 4076 మంది ఉండగా, ఏ.పీ.ఓలు 3968,ఓ.పీ.ఓలు 7952 మంది, మైక్రో అబ్జర్వరస్ 540 మంది ఉన్నారు. పోలింగ్ సిబ్బందికి ఎంపిక చేసిన వివిధ కేంద్రాలలో మాస్టర్ ట్రైనర్స్ చే పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పోలింగ్ విధుల కోసం నియమించబడిన సిబ్బందికి తక్షణమే ఉత్తర్వులతో పాటు ఫామ్-12 ను కూడా అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 1 మరియు 2వ తేదీల్లో పి.ఓ.లకు, ఏ.పి.ఓ.లకు పోలింగ్ నిర్వహణపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఎంపిక చేసిన వివిధ కేంద్రాలలోని ఒక్క రూమ్ లో 50 మంది మాత్రమే ఉండాలని,ప్రొజెక్టర్, ఈవీఎంలు తప్పని సరిగా ఉండాలని సూచించారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, డీఆర్ఓ సంగీత, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, ఎన్ఐసి అధికారి స్వర్ణలత, మ్యాన్ పవర్ మ్యానేజ్మెంట్ నోడల్ అధికారి శ్రీలక్ష్మి, ఎన్నికల విభాగం అధికారి సైదులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ అధికారులు, సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ పూర్తి

## జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్

**హైదరాబాద్ సిటీ, మార్చి 26(జనంసాక్షి):** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి అయ్యిందని జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. మంగళవారం తన ఛాంబర్ లో హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారుల సమక్షంలో పోలింగ్ అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఏప్రిల్ 1, 2 తేదీల్లో నియోజకవర్గ స్థాయిలో శిక్షణ ఇవ్వాలని, ఎన్నికల విధులు నిర్వహించే వారికి పోస్టల్ బ్యాలెట్ అందించి పోస్టల్ బ్యాలెట్ పై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ ఆదేశించారు. జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి మొత్తం 3,986 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

# శామీర్‌పేట్‌లో శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్నదానం



**శామీర్ పేట్ (జనం సాక్షి ):** శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్నదానం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఆలయ కమిటీ తోపాటు శామీర్ పేటకు చెందిన వాసగవని గణేష్ గౌడ్-సువర్ణ దంపతులు, దేశం మురళి గౌడ్- నాగలక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వ హించారు. వివిధ గ్రామాల భక్తులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# బీజేవైఎం నూతన జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్ కౌరీ



**బషీరాబాద్,మార్చి 26 (జనం సాక్షి)** నూతనంగా బీజేవైఎం వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్ కౌరీని పార్టీ అధిష్టానం నిర్ణయించింది. అదేవిధంగా పార్టీ అధిష్టానం మంగళవారం రోజున పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్ కౌరీ మాట్లాడుతూ బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు మాధవ రెడ్డి,బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సాయి చరణ్ రెడ్డి,పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ నాపై నమ్మకంతో ఇచ్చిన గౌరవ బాధ్యతలు,పార్టీ అభ్యున్నతికై మరింత బాధ్యతగా చేస్తానని తెలిపారు. బిజెపి పార్టీ పటిష్టతకు నరేంద్ర మోడీ నాయకత్వంలో పనిచేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి పార్టీ బలపరిచిన వ్యక్తి ఎంపీగా కొండా విశ్వేశ్వర్ రెడ్డిని గెలిపించి మరోసారి బిజెపి ప్రభుత్వం నుండి నరేంద్ర మోదిని ప్రధానమంత్రిగా చేయుటకు కృషి చేస్తానని తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం కార్యకర్తల సమావేశం



**మొయినాబాద్, మార్చి 26,(జనం సాక్షి):** చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి గెలుపు కోసం పార్లమెంటు స్థాయి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు, టి పి సి సి అధ్యక్షులు రేవంత్ రెడ్డి కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిగి శాసనసభ్యులు రామ్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి రంజిత్ రెడ్డి విజయం కోసం బాగా కష్ట పడాలని నాయకులు ఉదయ్ మోహన్ రెడ్డిని, సుభాష్ యాదవ్ ని కొమ్మిడి వెంకట్ రెడ్డిని ఆదేశించారు

# తాసిల్దార్‌కు వినతిపత్రం అందజేత

**యాచారం, మార్చి 26 (జనం సాక్షి) :** యాచారం మండలం మొండి గౌరెల్లి గ్రామం లో ఉన్న 19,68,127 అసైన్ మెంట్ సర్వే నెంబర్లులో భూమిని ప్రభుత్వం తీసుకుంటుందని వివిధ పత్రిక లలో వచ్చిన కథనాలను చూసి మంగళవారం గ్రామ ఎంపీటీసీ తాండ్ర లక్ష్మమ్మ ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలసి తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా ఎంపిటిసి మాట్లాడుతూ ఏట్టి పరిస్థితిలో భూములు ఇచ్చేది లేదని ముందు పొజిషన్లో ఉన్నవారికి పట్టా పాస్ బుక్ లు ఇయ్యాలని అన్నారు ఈ కార్యక్రమం లో బిజెపి కిసాన్ మోర్చారాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రిపల్లి అంజయ్య యాదవ్ ,మొండి గౌరెల్లి మాజి ఉపసర్పంచ్ మేకల యాదగిరి రెడ్డి,బిజెపి మండల అధ్యక్షులు తాండ్ర రవీందర్ ,బిజెపి సీనియర్ నాయకులు కుంచరపు సందీప్ రెడ్డి, కుంచరపు రాజవర్ధన్ రెడ్డి, కట్టెల నర్సింహా, బూత్ అధ్యక్షులు గుడాల వెంకటేష్ తదితరులు ఉన్నారు.





## వెంకటరమణ కాలనీ సమస్యలను మెరుగుపరుస్తాం

**అల్వాల్, మార్చి 26 (జనంసాక్షి) :** అల్వాల్ డివిజన్ వెంకటరమణ కాలనీ రెసిడెన్స్ అసోసియేషన్ లో నెలకొన్న సమస్యలను జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ స్థానిక కార్పొరేటర్ చింతల విజయశాంతి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మల్కాజిగిరి నియోజకవర్గం శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలో ఉన్న సమస్యలు కమ్యూనిటీ హాల్ నిర్మాణం సిసి రోడ్లు పార్క్ అభివృద్ధి పనులు పూర్తి చేసివీధి దీపాలు దోమలు కుక్కలు బెడదల నుండి నివారించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఆయన వెంటనే స్పందిస్తూ త్వరలోనే కాలనీలో ఉన్న మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ కాలనీ రెసిడెన్స్ అసోసియేషన్ అధ్యక్షులు కిషోర్ కుమార్, సాయి రెడ్డి, సుధాకర్ రెడ్డి, మనోహర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా కట్టెలను తరలిస్తున్న లారీ పట్టివేత

**కొడంగల్ మార్చి26(జనం సాక్షి)**

అక్రమంగా లారీలో తరలిస్తున్న కట్టెలను పట్టుకున్నట్లు కొడంగల్ ఎస్సై భరత్ రెడ్డి తెలిపారు. కర్ణాటక నుండి కొడంగల్ మీదుగా హైదరాబాద్ కు తరలిస్తున్న కట్టెల లారీని ఎస్ఐ లారీని ఆపి తనిఖీ చేయగా అనుమతి పత్రాలు డ్రైవర్ ను అడుగాగ ఎలాంటి అనుమతి పత్రాలు చూపించకపోవడంతో లారీ డ్రైవర్ పై కేసు నమోదు చేసి ఫారెస్ట్ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.



# శరీర దారుఢ్యానికి క్రీడలు ఎంతో కీలకం

### జేబీఆర్ఆసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.వెంకటరమణారెడ్డి



**మొయినాబాద్, మార్చి 26 (జనం సాక్షి):** క్రీడలు మానవుడి శరీర ధారుఢ్యానికి ఎంతో దోహదపడతాయని ' జేబీఆర్ఆసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జేబీఆర్ఆసీ ఇంజనీరింగ్ కళాశాలలో జేబీఆర్సీ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ జె.గాయత్రీ ఆధ్వర్యంలో క్రీడోత్సవాలను మూడు రోజులుగా నిర్వహించే క్రీడోత్సవాలలో మొదటి రోజు జ్యోతిప్రజ్వాలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించినప్పుడే విజ్ఞాన నైపుణ్యాన్ని పెంపొందించుకుంటారని సూచించారు. క్రీడలు ఆడడం వలన ఆరోగ్యానికి ఎంతో మేలు అన్నారు. గెలుపు ఓటములు సహజంగా తీసుకోని మూడు రోజుల పాటు నిర్వహించే కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఖోఖో, క్యారమ్స్, టెబుల్ టెన్నిస్, చెస్ క్రీడల్లో ఇంజనీరింగ్ విద్యార్థులు అందరు క్రీడల ఆనందాన్ని పంచుకోవాలని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ క్రీడలను అందరూ కలిసిమెలిసి ఆడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆరుణమూర్తి, జంగరాజు, ఎంఎల్ఎం ప్రసాద్, సివై రమేష్, అబ్దుల్ రహమాన్, ఏవో శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బి. వెంకటయ్య ఏకగ్రీవం

**కొడంగల్ మార్చి26(జనం సాక్షి):** కొడంగల్ బార్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం న్యాయవాదులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడు బి.వెంకటయ్య, వైస్ ప్రెసిడెంట్ కే.సంతోష్ కుమార్, జనరల్ సెక్రటరీ బి.భాగ్యలత, జాయింట్ సెక్రటరీ యం.కృష్ణం రాజు,ట్రెజరర్ కే.రమేష్, లైబ్రీరియన్ బి.కృష్ణ, స్పోర్ట్స్ కల్చరల్ సెక్రెటరీ కే.రాములు ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సీనియర్ అడ్వకేట్ వెంకట్ రెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడుగా ఎన్నికైన బి.వెంకటయ్య మాట్లాడుతూ రెండో పర్యాయం తనపై నమ్మకంతో అధ్యక్షుడుగా ఎన్నుకున్నందుకు న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. బార్ అసోసియేషన్ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సీనియర్ న్యాయవాదులు కరుణాకర్ రెడ్డి, బస్వరాజు,ఎవి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ పంచాయతీ కార్యాలయం ముందే సీసీ రోడ్డును అండర్ డ్రైనేజీగా వాడకం

**చౌడాపూర్,మార్చి 26(జనం సాక్షి):** వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్ర పరిధిలోని వీరాపూర్ గ్రామంలో సీసీ రోడ్ల పైననే మురికి నీటిని వదులుతూ చుట్టుముట్టు ఉన్న ప్రజలను రోగాల బారిన పడేస్తున్నారని,ఆ నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతూ ఇంటిలో కూడా ఉండలేకపోతున్నామని దోమల వల్ల,ఈగల వల్ల టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ జ్వరాలు కూడా వస్తున్నాయని ఆ నీరు పోవడానికి పరిష్కార మార్గం చూపమని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చుట్టుముట్టు ఉన్న ప్రజలతో మాట్లాడి అండర్ డ్రైనేజ్ నిర్మిస్తారా లేక ఇంకుడు గుంతలైన కొట్టించి పరిష్కార మార్గం చూపుతారో అని అధికారులను వేడుకుంటున్నారు.

## పార్లమెంట్ ఎన్నికల సమావేశం



**చౌడాపూర్,మార్చి 26(జనంసాక్షి):** పరిగి నియోజకవర్గ చౌడాపూర్ మండల కేంద్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్ కుమార్ మంగళవారం రోజు చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి,చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఇట్టి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైనటువంటి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్న సందర్భంగా చౌడపూర్ మండల కేంద్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్ కుమార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.

# రైతు సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా సహకార సంఘం పనిచేస్తుంది

### సహకార సంఘం చైర్మన్ తోటి రెడ్డి రాజేందర్ రెడ్డి



**యాచారం, మార్చి 26 (జనం సాక్షి):** నిరంతరం రైతు సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా సహకార సంఘం పనిచేస్తుందని సహకార సంఘం చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బ్యాంకులో సీఈఓ నాగరాజు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథులుగా చైర్మన్ తోటి రెడ్డి రాజేందర్ రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. సంఘం ద్వారా రైతులకు వ్యవసాయ అవసరాల నిమిత్తం కావలసిన స్వల్ప కాళికా ధీరకాలిక రుణాలను ఎప్పటికప్పుడు అందజేస్తూ రైతుల అభివృద్ధిలో సహకార సంఘం ముఖ్యపాత్రను పోషిస్తుందని అన్నారు. 2023 - 24 ఎడాదికిగాను పౌల్ట్రీ, పాడి, పశువులు, గొర్రెలు, మేకలు ఇతర అన్ని రకాల అవసరాలకు మొత్తం రూ. 5,49,23,210 దీర్ఘకాలిక రుణాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. రూపాయలు 58 లక్షలతో నూతన సహకార సంఘం భవనం త్వరలోనే అందుబాటులోకి రానున్నట్లు పేర్కొన్నారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించి సహకార సంఘం అభివృద్ధికి మరింత తోడ్పాటు అందివ్వాలని అన్నారు. కార్యక్రమంలోఉపాధ్యక్షులు కారింగ్ యాదయ్య, డైరెక్టర్లు కంబాలపల్లి మల్లారెడ్డి, పాచ్చ భాష, మక్కపల్లి స్వరూప, మద్దెల శశికళ, కొండాపురం కలమ్మ, అంబోజు లక్ష్మయ్య, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు

## ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దే ప్రయత్నాలు

**హైదరాబాద్,మార్చి26 :** మనిషి ఎదుగడానికి అభివృద్ధి మార్గాలు తెరిచి పెట్టడమే పేదరిక నిర్మూలన పథకాల లక్ష్యం కావాలని ఐక్యరాజ్య సమితి ఘోషిస్తున్నది. ఈ భావనతోనే అభివృద్ధి వ్యూహాలకు రూపకల్పన చేశారు. గతంలో ఉమ్మడి రాష్ట్ర పాలకులకు ప్రచారార్భాటమే తప్ప పేదరిక నిర్మూలన పట్ల చిత్తశుద్ధి ప్రకటించలేదు. అందుకే ప్రజలకు దానిపై ఆసక్తి కూడా క్రమంగా తగ్గుతూ వస్తోంది. బడ్జెట్ అంటే సంవత్సరానికొక్కమారు ప్రభుత్వాలు చట్టసభల్లో ప్రవేశపెట్టే తద్దినంగా ప్రజలు భావించే స్థితి వచ్చిందంటే దానికి కారణం పాలకులు వాటిని వాస్తవ పరిస్థితులకు దూరంచేసి అంకెల గారడీగా మార్చడమే. పేదల సంక్షేమానికి పెద్దపీట వేయడం, వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు జవజీవాలు సమకూర్చడం, కులవృత్తులకు ఆలంబన, గ్రామీణ సమాజాన్ని అభివృద్ధి కాముకమైనదిగా చూడటం మొదలైనవన్నీ ఆర్థిక ప్రగతికి దోహద పడతాయి. ఎవరు ఉన్నా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దిగజారింది. కులవృత్తులకు ప్రాధాన్యం లేకుండా పోయింది. చిన్ననీటి పారుదల రంగం వట్టి పోయింది.

ప్రాజెక్టులు, మేఘమధనం పేరుతో ఉమ్మడి ఎపిని దోచుకుతిన్నారు. గతంలో బడ్జెట్‌లో కేటాయింపులు ఘనంగా చూపించడం ఖర్చుల్లో కోతలు పెట్టడం ప్రభుత్వాల ఘన కార్యాలుగా చెప్పుకున్నారు. బడ్జెట్‌లో తాయిలాలు ప్రకటించడం, భారాలు తరువాత వేయడం కూడా మరో ఎత్తుగడ వేయడం కాంగ్రెస్ హయాంలో జరిగిందని చెప్పడానికి అనుమానాలు అక్కర్లేదు. ఖర్చులకూ సంబంధం లేకుండా ప్రభుత్వ వ్యవహారాలు నడిచాయి. కానీ ఇప్పుడు తెలంగాణలో వాస్తవాలకు దగ్గరగా లెక్కలు వేశారు. మనగురించి బడ్జెట్‌లో చర్చించారన్న భరోసా ఆయా వర్గాలకు కలిగింది. సామాజికాభివృద్ధిని ఆర్థిక కోణంలోనే చూడలేము. పారిశ్రామికాభివృద్ధి ఒక్కటే కొలమానం కాదు.

## వేసవి వస్తోందంటే ఏటా నీటికి కటకటలు

**న్యూఢిల్లీ,మార్చి26 :** వేసవి వస్తోందంటే ఏటా నీటికి కటకటలు తప్పడం లేదు. మంచినీటికి దిక్కు ఉండడం లేదు. గత యేడాది భారీగా వర్షాలు కురిసినా ఇప్పుడు పల్లెలు, పట్టణాల్లో మళ్లీ నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. సంబంధించిన ఆందోళనలు కానవస్తున్నాయి. నదీజలాల విషయంలో జాతీయ విధానం తీసుకుని రావడంలో పాలకులు విఫలమయ్యారు. దేశంలోని నదీజలాల లభ్యత, పంపకాలను పరిశీలిస్తే జాతీయ జలవిధానం అవసరమన్న విషయాన్ని కేంద్రం గుర్తించడం లేదు. ఈ దేశంలో ఉన్న జలాలపై దేశ ప్రజలందరికి సమాన హక్కులు ఉండాలి. రైతులకు సమాన వాటా రావాలి. ఎగువ రాష్ట్రాలే నీటిని ఒడిసి పట్టుకుని దిగువ రాష్ట్రాలకు మొండిచేయి చూపే విధానం పోవాలి. లేకుంటే భవిష్యత్‌లో మరిన్ని సమస్యలు రాగలవు. అలాగే నీటిని ఒడిసి పట్టే విధానాలు విస్మరించడం వల్ల ఏటా మంచినీటి కొరతలు వేదిస్తున్నాయి. దీంతో సాగు,తాగునీటికి ఏటా కటకట తప్పడం లేదు. జాతీయ జలవిధానం రూపొందించి నదీ జలాల సమగ్ర వినయోగం జరిగివుంటే దేశంలో కరవు తాండవించేది కాదు. ఇప్పటికే కావేరీ జలాల విషయమై కర్ణాటక, తమిళనాడు సిగపట్లు పడుతున్నాయి. ఈ సమస్య రాగానే ఉభయారాష్ట్రాలు భగ్గుమంటున్నాయి. కృష్ణా నదీ జలాల పంపిణీలో ఉభయ తెలుగు రాష్ట్రాలకూ అన్యాయం జరిగింది. కర్నాటక పైన ఆల్మట్టి, నారాయణపూర్ రిజర్వాయర్లు కట్టడంతో కిందికి చుక్కనీరు రాని పరిస్థితి ఏర్పడింది. వరదలు వస్తే తప్ప నీరు రాని దుస్థితి ఏర్పడింది. తాజాగా ఇప్పుడు కృష్ణాలో తాగునీటి అసవరాలకు కూడా నీరు అందని దుస్థితి ఏర్పడింది. ఈ రకమైన వివాదాల్ని ముస్ముందు నివారించే దిశగా కేంద్రం, ట్రిబ్యునళ్లు సహకరించాలి. తుదితీర్పు వచ్చేలోగా తెలుగు రాష్ట్రాలు సమర్థ వంతమైన వాదనతో తమ న్యాయమైన హక్కుల్ని కాపాడుకోవాల్సిన అవసరముంది. ఇవన్నీ పరిష్కారం కావాల్సిన సమయంలో కేంద్రం కూడా సమభావనతో ఉండాలి. ఆల్మట్టి,నారాయణపూర్‌లను కట్టుకుని నీటిని వాడుకుంటున్న కర్నాటక తీరువల్ల కిందికి చుక్కనీరురాని పరిస్థితి ఏర్పడింది. అందుకే సుప్రీం కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ప్రస్తుతానికి అమల్లో ఉన్న బచావత్ కేటాయింపులను ప్రాజెక్టులవారీగా, రాష్ట్రాల వారీగా పుఃనపంపిణీ చేయాలని ఏపీ, తెలంగాణలు డిమాండ్ చేస్తున్నాయి. కావేరీ విషయంలో ఇదే జరిగింది. ఇప్పుడు కర్నాటక నీటిని అంతా వాడుకుంటే తమిళనాడు గతేం కానుందన్నది అందరికి తెలిసిందే. ఈ దశలో కేంద్రం నదీజలాల పంపిణీని సీరియస్‌గా తీసుకోవాలి. ఇది జాతీయ సమస్యగా చూడాలి. తక్షణ సమస్యగా పరిగణించాలి. కావేరీ, కృష్ణా వివాదాలు ముదరక ముందే ఓ నిర్ణయం తీసుకుని జాతీయ జలవిధానానికి శ్రీకారం చుట్టాలి. భవిష్యత్ యుద్దాలకు అడ్డుకట్ట వేయాలి.

## దాడికి గురైన బాధితులకు పరామర్శ



**మేడిపల్లి (జనంసాక్షి) :** బోడుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో హెూలీ పండుగ సందర్భంగా పిట్టల సామాజిక వర్గం వారు హెూలీ సంబరాలు జరుపుకుంటుండగా ఒక వర్గం వారు మసీదులో ప్రార్ధనల అనంతరం పిట్టల సామాజిక వర్గం వృద్ధులు, మహిళలు ప్రజలపైన రాళ్ల దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ సందర్భంగా చెంగిచెర్లలోని బాధితులను కలుసుకొని వారికి ధైర్యం చెప్పడానికి, చట్టపరంగా రాష్ట్ర ప్రభుత్వం త్వరగా చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ సంఘటన ప్రాంతానికి విచ్చేశారు. వారితో పాటు ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు డా కళ్యాణ్ నాయక్ ఉన్నారు. దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రదాన కార్యదర్శి రవి నాయక్ నేనావత్, బోడుప్పల్ బీజేపీ ప్రధాన కార్యదర్శి ఏర్పుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మండుటెండలు..రాజకీయ ప్రచారాలు

**హైదరాబాద్,మార్చి26 :** మండుటెండలు తెలంగాణతో పాటు ఎపిలోనూ వివిధ పార్టీల కార్యకర్త లకు పరీక్ష పెట్టబోన్నాయి. ఎండాకాలం ఎన్నికలతో పార్టీల నేతలు మొదలు కార్యకర్తలు నానా హైరాన పడుతున్నారు. ఎన్నికల పోరులోకాంగ్రెస్ పార్టీ కూడా ఇందుకు సమాయత్తం అవుతోంది. ఎపిలో టిడిపి ఉమ్మడిగా పోరాటం చేపట్టింది. ఈ క్రమంలో పార్టీల్లో ఉన్న కార్యకర్తలంతా ఎండల్లో పడి పోరాడాల్సి ఉంటుంది. ఎండలు ఆందోళనకరంగా పెరుగుతున్న దశలో పార్టీల కార్యక్రమాలుమరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రజలు ఇంటిపట్టున ఉండి దూరంగా ఉందా మనుకున్నా రాజకీయాల కారణంగా బయటకు రాక తప్పని పరిస్థితులు వస్తున్నాయి. వరుస ఆందోళనతో అధికార పార్టీతో పాటు అనేక పార్టీల కార్యకర్తలు నానాయాతన పడుతున్నారు. మార్చి ఎండలే కదా అని సర్దుకున్నా ఇప్పుడు మండుటెడల్లో ఆందోళనలకు దిగాల్సి వస్తోంది. టిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి పార్టీలతో పాటు ఇతర చిల్లర పార్టీలకు కూడా ఈ యాతన తప్పడం లేదు. ఎక్కడ వెనకబడి పోతామో అన్న భయంతో నేతలు కార్యకర్తలను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారు. దీనికితోడు ఎన్నికల్లో పోటీకి రాజకీయ పార్టీలన్నీ ఇప్పటి నుంచే వ్యూహాలు రూపొందిస్తు న్నాయి. అన్ని పార్టీలు మళ్లీ పోటీకి సమాయత్త మవుతున్నాయి. గెలుపు గుర్రాలను బరిలో దించి పాగా వేసేందుకు వ్యూహారచన చేస్తున్నాయి. ఇప్పటి నుంచే పట్టుపెంచుకునేందుకు కాంగ్రెస్, కొన్నిచోట్లనైనా ఖాతా తెరిచేలా భాజపా ఇలా ఎవరికి వారు అంచనాలు వేస్తున్నారు. ఆయా పార్టీల అధిష్ఠానాలు రాబోయే ఎన్నికలపై ప్రత్యేక దృష్టిపెట్టాయి.

## KLEEE, KLSAT, KLE-CET, KLHAT, KLMAT కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్న కెఎల్ డీమ్డ్ టు బి యూనివర్శిటీ



**హైదరాబాద్, 26 మార్చి (జనంసాక్షి) :** ఉన్నత విద్య పట్ల తమ నిబద్ధతకు ప్రసిద్ధి చెందిన కె ఎల్ డీమ్డ్ టు బి యూనివర్శిటీ, త్వరలో తాము నిర్వహించబోయే ప్రవేశ పరీక్షలు, ముఖ్యంగా అకడమిక్ సెషన్ 2024 లో విభిన్న కోర్సుల అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్షలుగా గుర్తించబడిన KLEEE, KLSAT, KLE-CET, KLHAT, KLMAT కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. దరఖాస్తు గడువును మార్చి 29, 2024 వరకు పొడిగించడం ద్వారా ఔత్సాహిక అభ్యర్థుల అవసరాలకనుగుణంగా విశ్వవిద్యాలయం ప్రతిస్పందించింది. KLEEE, KLSAT, KLECET, KLHAT, KLMAT ప్రవేశ పరీక్షలు మార్చి 30, 2024 మరియు మార్చి 31, 2024న జరగనున్నాయి. ఈ పొడిగింపు విశ్వవిద్యాలయం లో ఔత్సాహిక విద్యార్థులు ప్రతిష్టాత్మక ప్రోగ్రామ్‌ల కోసం దరఖాస్తులను సిద్ధం చేయడానికి మరియు సమర్పించడానికి అదనపు సమయాన్ని అందిస్తుంది.

## పెంచిన టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలి

### నిరుద్యోగులపై ఆర్థిక భారం మోపడం సరికాదు : ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్



**మేడిపల్లి (జనంసాక్షి) :** టెట్ పరీక్ష ఫీజు అధికంగా పెంచడం వల్ల నిరుద్యోగులపై పెను భారం పడుతుందని, గతంలో ఒక పేపర్ రాస్తే 200, 2 పేపర్లు రాస్తే 300 ఫీజు ఉండేది కానీ ఇప్పుడు ఒక పేపర్‌కి 1000 రూపాయలు రెండు పేపర్లు రాస్తే 2000 రూపాయల ఫీజు పెట్టడం సరికాదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రవేశ పరీక్షలు ఫీజులు తగ్గించి తక్కువ ఫీజులతో పోటీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు, కానీ ఎన్నికల హామీకి విరుద్ధంగా అధిక ఫీజు పెట్టారని, లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులు టెట్ పరీక్షకు సన్నద్ధమవుతున్నారని ఇప్పటికే బిఆర్ఎస్ పాలనలో పరీక్ష ఫీజులు కట్టి, కోచింగ్ తీసుకొని పరీక్షల్లో అవకతవకల వల్ల నిరుద్యోగులు ఆర్థికభారంతో ఉన్నారని, రేపటి నుంచి టెట్ పరీక్ష ఫీజు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో పాత ఫీజునే తీసుకోవాలని, అదే విధంగా పరీక్ష సెంటర్లను కూడా నిరుద్యోగులకు అందుబాటులో ఉండే విధంగా సెంటర్ల సంఖ్య కూడా పెంచాలని, దీని వల్ల నిరుద్యోగుల పై ప్రయాణ భారం తగ్గనుందని, కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులు అండగా ఉండాలని, ప్రభుత్వం, అధికారులు పెంచిన టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

## నార్డ్ ఆంగ్లియా కాన్ఫరెన్స్‌లో 'ఓక్రిడ్జ్' ఉపాధ్యాయులు




**హైదరాబాద్, మార్చి 26 (జనంసాక్షి) :** విద్యా ప్రమాణాలు పెంపొందించడం, వినూత్న బోధనా పద్ధతులను అన్వేషించడం కోసం వియత్నాంలోని హనోయిలో ఇటీవల జరిగిన నార్డ్ ఆంగ్లియా ఎడ్యుకేషన్ టీచింగ్ అండ్ లెర్నింగ్ కాన్ఫరెన్స్‌లో ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్, బాచుపల్లి (ఓఐఎస్బీ) ఫ్యాకల్టీ ప్రముఖ పాత్ర పోషించారు. ఈ ప్రతిష్టాత్మక గ్లోబల్ ఈవెంట్‌కు పదిహేను దేశాల నుంచి రెండు వందల మందికి పైగా విద్యావేత్తలు హాజరయ్యారు. ఈ సమావేశంలో అధ్యాపకులు, ఆలోచనా నాయకులు, అభ్యాసకులు సాంకేతికత ఏకీకరణ, విచారణ ఆధారిత అభ్యాస వాతావరణాలు పెంపొందించడంపై చర్చించారు. ఈ వర్క్‌షాప్‌లో అత్యాధునిక పద్ధతులపై మాట్లాడారు. ఈ ప్రపంచంలో విద్యార్థులను సక్సెస్ చేయడానికి పాఠ్యాంశాల్లో విభిన్న దృక్కోణాల ప్రాముఖ్యతపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ బాచుపల్లి ప్రిన్సిపాల్ బల్జీత్ ఒబెరాయ్ ఎడ్యుకేషనల్ లీడర్‌షిప్, ఇన్నోవేషన్‌పై వ్యాఖ్యాతగా ఉన్నారు. బోధన, అభ్యాసం, స్కూల్ అడ్మినిస్ట్రేషన్లో విప్లవాత్మకమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సామర్థ్యాన్ని చెప్పారు. టెక్నాలజీ అనేది అధ్యాపకులను ఎలా శక్తివంతం చేస్తుందో వివరించారు.